ఏ బిడ్డా.. మంగళం మా అడ్డా!

రెచ్చిపోతున్న ఎర్రదొంగలు



వ్యవసాయం సహా ప్రతి వృత్తికీ ఒక సీజన్ అంటూ ఉంటుంది. చివరికి దొంగలు కూడా ఎండాకాలం రాగానే జోరు పెంచుతారు. ఒక్క ఎర్రదొంగలు మాత్రమే సీజన్‌లెస్ స్మగ్లింగ్‌తో రెచ్చిపోతున్నారు. ఎన్నికల కోడ్ అడ్డు కూడా లేదు. అధికారులు, నాయకులు, ప్రజలు సకల వర్గాలూ ఎన్నికల హోరులో మునిగి తేలుతుండగా ఎర్రచందనం దొంగలు మాత్రం దర్జాగా దుంగలను అడవి దాటించే పనులు సాగిస్తున్నారు. తిరుపతి నగరంలోని మంగళం ప్రాంతం వీరికి ప్రధాన అడ్డాగా కొనసాగుతోంది.

- రాత్రి చందనం, పగలు గంజాయి
- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

మంగళం, ఏప్రిల్ 6 : తిరుపతి నగర శివారు ప్రాంతాలైన మంగళం ప్రాంతంలో అడవి అంచున ఉండే భూపాల్ హౌసింగ్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, తిమ్మినాయుడుపాళెం ప్రాంతాల్లో రాత్రి 11 నుంచీ అపరిచితుల కదలికలు మొదలవుతాయి. చేతిలో టార్చిలైట్లు, గొడ్డళ్లు, ఇతర సామగ్రి వీరి వద్ద ఉంటుంది. ముందుగా 20 నుంచి 30మంది శేషాచలం కొండల్లోకి అడుగుపెడతారు. కొండల్లో అంతా సేఫ్ అని సమాచారం ఇచ్చాక మిగిలినవాళ్లు కొండల్లోకి నడక మొదలు పెడతారు. తెల్లవారు జామున మళ్లీ కదలికలు పెరుగుతాయి. ఎర్రచందనం దుంగలను చిన్నచిన్న ముక్కలుగా చేసి బయటకు తెస్తారు. అప్పటికే సిద్ధంగా ఉన్న బైక్‌లు, కార్లు, జీపుల ద్వారా అవి లక్ష్యం వైపు చేరుకుంటాయి. బీటీఆర్ కాలనీకి పైభాగాన కొండ పక్కన ఉన్న ఇళ్ల మధ్య ఈ కదలికలు మరీ ఎక్కువగా ఉంటున్నాయి. స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.బీటీఆర్‌కాలనీ, మంగళం ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకునే అపరిచితులు నెల రోజులుగా పెరిగారని తెలుస్తోంది.పెద్దపెద్దవాళ్లే దీని వెనుక ఉన్నారని అపరిచితులు టీ బంకులు దగ్గర అలా మాటలు వదులుతారు.దీంతో మనకెందుకులే అని జనం సమాచారం కూడా ఎవరికీ ఇవ్వరు. అయితే ఎర్ర దొంగలు పనిలో పనిగా గంజాయిని కూడా వ్యాప్తిలోకి తెస్తున్నారు. ఈ కాలనీల్లోని కుర్రాళ్లను పోగేసి గంజాయికి అలవాటు చేస్తున్నారని జనం ఆందోళన చెందుతున్నారు. అడవిలోంచి ఎర్ర దుంగలను బయటకు తరలించే వాహనాలే గంజాయిని తెస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల వేళ నాయకులకూ డబ్బు అవసరాలు ఎక్కువ కాబట్టే ఎర్ర స్మగ్లింగ్ జోరు పెరిగింది అనే మాటలు ఈ ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి.



వైసీపీ ఆత్మీయ సభలో

టౌన్ బ్యాంకు మేనేజర్

ఎన్నికల ప్రచారాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించినప్పటికీ కొంత మంది ఉద్యోగులు ఆ నిబంధనలు పాటించడం లేదు.తిరుపతి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ ఉద్యోగులతో వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శనివారం ఒక హోటల్లో సమావేశం నిర్వహించారు. టౌన్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి, వైస్ ఛైర్మన్ వాసు యాదవ్ ఆదేశాలతో బ్యాంకు మేనేజర్ ప్రభాకర రెడ్డి (పాండు)ఈ సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్‌గా ఉన్న వ్యక్తి అధికార పార్టీ నాయకుడికి ఓట్లు వేయాలని కోరే సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.బ్యాంకు ఉద్యోగుల సంఘానికి ప్రభాకర రెడ్డి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.మెడికల్ బిల్స్ ఇస్తామని మాజీ ఉద్యోగులను బ్యాంకు పక్కనే ఉన్న ఓ హోటల్‌కు పిలిపించినట్లు తెలుస్తోంది. తీరా అక్కడ వైసీపీ అభ్యర్థి ప్రత్యక్షమై ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో పాండుపై కొంతమంది మాజీ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మామండూరులో

ఏనుగుల విధ్వంసం



రేణిగుంట మండలం మామండూరు అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న మామిడితోపులో శనివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. ఏనుగుల సంచారాన్ని గుర్తించిన స్థానికులు బాణాసంచా పేలుళ్లతో బెదిరించే ప్రయత్నం చేశారు. అయితే ఏనుగులు మామిడితోపు నుంచి వెళ్లకపోవడంతో గ్రామస్తులు వాటి దిశ మార్చి ఉదయం బయటకు పంపగలిగారు.బాధిత రైతు మురళి మాట్లాడుతూ ఏనుగుల గుంపుతో నష్టపోతున్న విషయమై గతంలో అటవీశాఖ అధికారులకు తెలియజేస్తే స్పందించలేదన్నారు. కేవలం ఫొటోలు తీసుకుని వెళ్లడం తప్ప సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మామిడితోపులకు ముందు ఏనుగులు రాకుండా ఏర్పాటు చేసిన గుంతలు పూడిపోయిన విషయాన్ని కూడా గతంలో అటవీశాఖ అధికారులకు చెబితే ఏఎఫ్‌వోను పంపి చేతులు దులుపుకున్నారని వాపోయారు.ఇప్పటికైనా ఏనుగుల దాడుల నుంచి రక్షణ కల్పించాలని, అలాగే నష్టపోయిన తమ పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

- రేణిగుంట

దోషం దందా..!

- రాహు-కేతు పూజల్లో ఆగని బలవంతపు వసూళ్లు
- ముక్కంటీశుడి ఆలయంలో ఐదేళ్లుగా అంతులేని అవినీతి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదేళ్లుగా అవినీతికి అంతే లేకుండా పోయింది. ప్రత్యేకించి రాహు-కేతు పూజల్లో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు విచ్చలవిడిగా సాగిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క విభాగంలోనే రూ.50 కోట్లకుపైగా అక్రమ సొమ్మును పోగేసి.. వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. నిత్యం ఇది బాహాటంగా జరుగుతూనే ఉన్నా ఏ ఒక్క అధికారి కూడా ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోలేదన్న అపవాదు నేటికీ కొనసాగుతూనే ఉంది. - శ్రీకాళహస్తి



గ్రహణకాల సమయంలో అన్నిచోట్లా ఆలయాలను మూత వేసి.. విడుపు తర్వాత తిరిగి తెరుస్తుంటారు. కానీ శ్రీకాళహస్తిలో నవగ్రహాలను కవచంగా ధరించి కొలువుదీరిన వాయులింగేశ్వరుడికి అన్ని గ్రహణకాల సమయాల్లోనూ విశేషంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. అంతేకాకుండా ఈ సమయంలో ఆలయాన్ని తెరచి భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. ఈ గ్రహణ కాల అభిషేకాలను దర్శించుకోవడానికి విశేషంగా భక్తులు తరలివస్తారు.

ఇంతటి మహిమాన్విత క్షేత్రం కావడంతో ముక్కంటి ఆలయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ఇటీవల దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో రాహు-కేతు పూజలు చేసుకునేందుకు విచ్చేస్తున్నారు.

దక్షిణ పెడితేనే దోషం పోతుందంటూ..

ఆలయంలో రాహు- కేతు పూజలను ఐదు ధరల టికెట్లపై నిర్వహిస్తుంటారు. రూ.500, రూ.750, రూ.1500, రూ.2500, రూ.5000 టికెట్లుగా విభజించి ఆయా మండపాల్లో బ్యాచ్‌ల వారీగా పూజలు చేస్తుంటారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రోజూ ఈ పూజలు జరుగుతూనే ఉంటాయి. మండపాల్లో ఆశీనులైన భక్తులతో సామూహికంగా సంకల్పాన్ని మైక్‌లో అనౌన్స్ చేస్తూ రాహు-కేతు పూజలు జరిపిస్తారు. ఇదే మైక్ నుంచే ప్రతి ఒక్కరూ.. దక్షిణ ఇస్తేనే మీ దోషం పోతుందంటూ భక్తులను మానసికంగా భయపెడుతున్నారు. రూ.2,500 పూజలో అయితే రూ.201, రూ.5,000 పూజలో అయితే రూ.501 దక్షిణ పెట్టాలంటూ బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఆలయంలో నెలకు అన్నిరకాల టికెట్లు కలిపి మొత్తం సుమారు లక్ష రాహు-కేతు పూజలు జరుగుతాయని అంచనా. అంటే సగటున రూ.100 చొప్పున లెక్కేసినా నెలకు రూ.కోటి సునాయాసంగా పోగేస్తున్నారు. అంటే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.50 కోట్లకు ఈ దందా చేరిందన్నమాట. ఈ అక్రమ సొమ్మును నియోజకవర్గ ముఖ్య నేత నుంచి, కిందిస్థాయి ఆలయ సిబ్బంది వరకు బొక్కేస్తున్నారన్న విమర్శలున్నాయి.

భక్తులు నిలదీసినా..

ఈ అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు నిలదీశారు. దీనిపై లిఖితపూర్వకంగా దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అంతేకాకుండా ఇలా మండపాల్లో అక్రమ వసూళ్లపై నిలదీసిన భక్తులను కొన్ని సందర్భాల్లో ఆలయ ఉద్యోగులు చేయి చేసుకున్న ఘటనలు కూడా వెలుగు చూశాయి.

ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించినా..

బలవంతపు వసూళ్లు చేయడం మంచి పద్ధతి కాదని ఎందరో ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించారు. ఏడాది క్రితం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆలయాన్ని దర్శించుకున్నారు. బహిరంగంగా మీడియా ఎదుటే రాహు-కేతు పూజల్లో వసూళ్లు తగదంటూ పాలకులకు, అధికారులకు హితవు పలికారు.

98శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6: జిల్లాలో సామాజిక పింఛన్లు శనివారం నాటికి 98.89శాతం పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.2,71,477మంది లబ్ధిదారులకుగాను గత నాలుగురోజుల్లో 2,68,474మందికి పింఛన్లు అందినట్లు తెలిపారు. 3,003మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

65మంది వలంటీర్ల రాజీనామా

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా శనివారం 65మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. కోట మండలంలో 24మంది, తడలో 13, నాయుడుపేటలో నలుగురు, తొట్టంబేడులో ముగ్గురు, సూళ్ళూరుపేటలో ఇద్దరు, తిరుపతి రూరల్ మండలంలో 10 మంది రాజీనామా చేశారు. వీరితో కలిపి ఇప్పటి వరకు జిల్లాలో 111మంది రాజీనామా చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.అయితే మన పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాజీనామా చేసి ప్రచారం చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వలంటీర్లపై వైసీపీ నేతలు వత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.28

సహరి (సోమవారం) : ఉ. 4.44

ఎమ్మెల్సీ సిపాయికి నోటీసులు జారీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యానికి నోటీసులు జారీ చేశారు. శ్రీకాళహస్తిలో పెద్ద మసీదు వద్ద శుక్రవారం స్వీటుప్యాకెట్లను ముస్లింలకు ఆయన పంపిణీ చేయడంపై ఆంధ్రజ్యోతిలో శనివారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రవి శంకర్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్సీకి నోటీసు జారీ చేశారు.ఆయన వివరణ అందిన తరువాత పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వెల్లడించారు.

టీడీఆర్ బాండ్లపై

ఇప్పుడేమంటారు ?

- రూ.4వేల కోట్ల అవినీతిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం డిమాండు



మీడియా సమావేశంలో ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల కోసం జారీ చేసిన టీడీఆర్ బాండ్లను ఆపేయాలని ప్రభుత్వమే నోటీసులు జారీ చేయడంతో తాము గతంలో ఆరోపించిన అవినీతి విషయాలను అంగీకరించినట్లయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తెలిపారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.బాండ్ల జారీ విషయంలో రూ. 10వేల కోట్ల అవినీతికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి పాల్పడ్డారని గతంలో తాను వెల్లడించానన్నారు.అప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఇచ్చిన నోటీసులకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 రోడ్ల కోసం 376 టీడీఆర్ బాండ్లు తయారు చేసి రూ. 4వేల కోట్ల అవినీతికి శ్రీకారం చుట్టారని ఆనం ఆరోపించారు. ఇందులో రూ. 2వేల కోట్లు ఇప్పటికే బాండ్ల రూపంలో కొనుగోలు చేశారని వెల్లడించారు. జరిగిన అవినీతిపై విచారణ చేయించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కరుణాకరరెడ్డి, అభినయరెడ్డిపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఇందులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత కూడా అవినీతిలో భాగస్తులేనన్నారు.గత ఆర్డీవో నరసారెడ్డి, రిజిస్ట్రార్, సర్వేయర్‌లకు కూడా ఇందులో ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. మరో 2 నెలల్లో టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమని, టీడీఆర్ బాండ్ల జారీపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఆనం హెచ్చరించారు. భూములు ఇచ్చి నష్టపోయిన బాధితులకు తమ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

కల్లూరు అడవిలో చిరుత సంచారం!

కల్లూరు, ఏప్రిల్ 6: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని కల్లూరు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లెకు వెళ్లే అడవిమార్గంలో శనివారం రాత్రి చిరుతపులి సంచరించింది. కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన కొందరు కారులో కల్లూరుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు హైవే రోడ్డు దాటుకొని కొమ్మిరెడ్డిగారిపల్లె వైపు వెళుతుండగా రాత్రి ఏడు గంటల సమయంలో చిరుతపులి రోడ్డును దాటడం గమనించి భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ రవిప్రకాశ్‌రెడ్డి ఆ స్థలాన్ని పరిశీలించారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న దర్శనం

చంద్రగిరి, ఏప్రిల్ 6: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేక డిప్యూటీఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రారంభం



చంద్రగిరి, ఏప్రిల్ 6: చంద్రగిరిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నూతన శాఖను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ వడ్డీతో రైతులకు, వ్యాపారస్తులకు రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తామన్నారు. త్వరలో ఖాతాదారులకు లాకర్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. బ్యాంక్ క్లస్టర్ హెడ్ మునిశ్రీకాంత్‌రెడ్డి, క్యాండర్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగశ్వేత, విశాలాక్షి జనార్ధన్‌రెడ్డి, బ్లూల్యాండ్ అధినేత నరేంద్రనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ యువనేత జన్మదిన వేడుకలు



వినీల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తులసేశ్వరరెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 6: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల టీడీపీ ఉపాధ్యక్షుడు తులసేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వినీల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు.

టీడీపీ కార్యాలయంలో....

తిరుచానూరు, ఏప్రిల్ 6: పులివర్తి వినీల్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం తిరుపతి రూరల్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి వినీల్ కేక్ కట్ చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

చంద్రగిరి, ఏప్రిల్ 6: చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయ విద్యార్థిని అదృశ్యంపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం సున్నపుతాండాకు చెందిన భువనేశ్వరి హాస్టల్లో ఉంటూ, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం భువనేశ్వరి కనిపించకపోవడంతో హాస్టల్ యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారమందించింది. దీంతో ఆమె తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



ముప్పిరెడ్డి కృష్ణారెడ్డి (ఫైల్‌ఫోటో)

భాకరాపేట, ఏప్రిల్ 6: పీలేరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నగొట్టిగల్లు మండలం మారసాని వారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ముప్పిరెడ్డి కృష్ణారెడ్డి మృతి చెందాడు. కృష్ణారెడ్డి మృతి విషయం తెలియగానే టీడీపీ నాయకులు, కార్యకర్తలు దిగ్భ్రాంతి చెందారు. ఆయన మృతి టీడీపీకి తీరని లోటు అంటూ సంతాపం ప్రకటించారు.

అమ్మవారి సేవలో సీఎస్ జవహర్‌రెడ్డి



తిరుచానూరు, ఏప్రిల్ 6: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు.డిప్యూటీ ఈవో గోవిందరాజన్, వీజీవో బాలిరెడ్డి పాల్గొన్నారు.

అనుపల్లిలో టీడీపీ ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 6: మండలంలోని అనుపల్లిలో టీడీపీ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ముందుగా పులివర్తి వినీల్, ఆరి లీలామోహన్‌నాయుడు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి నానీని గెలిపించాలని కోరారు. టీడీపీ మండలాధ్యక్షులు తిరుమలరెడ్డి మాట్లాడుతూ పులివర్తి నానీని గెలిపిస్తే అనుపల్లి పంచాయతీలో డీకేటీ భూముల సమస్య పరిష్కరిస్తారన్నారు. టీడీపీ నాయకులు బిందుమాధవి, ప్రకాష్, రూప్ రాయల్, ప్రసాద్‌రెడ్డి, మొగల్‌రెడ్డి, విజయ కుమార్‌రెడ్డి, వెంకటేష్, వెంకటేష్‌రెడ్డి, కృష్ణమూర్తి, సోమురాయల్, బొడ్డు మధుసుదన్‌రాయల్, సుబ్రహ్మణ్యం రెడ్డి, సోమశేఖర్, నరసింహారెడ్డి, మహేష్, కుమార్, రమేష్ పాల్గొన్నారు.

పది మంది వలంటీర్ల రాజీనామా

తిరుపతిరూరల్, ఏప్రిల్6: తిరుపతి రూరల్ మండలంలో వెంకటపతినగర్ పంచాయతీకి (సచివాలయ) చెందిన పది మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఎంపీడీవో కార్యా లయంలో ఏవో పిచ్చిరెడ్డికి రాజీనామా పత్రాన్ని సమర్పించారు. కాగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వైసీపీ తరపున ప్రచారం చేస్తే విధుల నుంచి తొలగిస్తున్నారు. దీంతో రాజీనామా చేసి ప్రచారం చేయడానికి రాజీనామా నాటకానికి తెరతీశారన్న చర్చ నడుస్తోంది. వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే తమకే వలంటీర్ ఉద్యోగం దక్కుతుందన్న ఆలోచనతోనే రాజీనామా చేశారని పలువురు చర్చించుకుంటున్నారు.

కోడలి కోసం చేయికోసుకున్న అత్త

వెలుగు అధికారుల తీరుపై నిరసన

సంఘమిత్ర నియామకంపై కన్నీరు



చేతికి కట్టుతో నిర్మల కుమారి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 6: తన కోడలితో మూడేళ్లుగా ఉచితంగా పనులు చేయించుకుని ఇప్పుడు వేరే మహిళను సంఘమిత్రగా నియమించుకోవడంతో మనస్తాపానికి గురైన అత్త చేయి కోసుకుని నిరసన తెలియజేసింది. వెలుగు అధికారుల తీరుపై కన్నీరుమున్నీరైంది. ఈ ఘటన శనివారం వరదయ్యపాళెంలో చోటు చేసుకుంది. ఆమె కథనం మేరకు.. ఇందిరానగర్ పంచాయతీ వీవో లీడర్‌గా నిర్మలకుమారి పనిచేసేది. ప్రస్తుతం ఆమె విధుల్లో లేరు. అయితే నిర్మలకుమారి కోడలు సుకుమారి సంఘమిత్రగా మూడేళ్లుగా పనిచేస్తోంది. అయినా వెలుగు అధికారులు ఆమె పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. పైగా కోడలికి కాకుండా సంఘమిత్ర బాధ్యతలు వేరే మహిళలకు అప్పగించడంతో ఆమె శనివారం వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. సీసీ యశోదను నిలదీశారు. మూడేళ్లుగా తన కోడలితో ఉచితంగా పనిచేయించుకుని ఇపుడు మరో మహిళను ఎలా నియించుకుంటారని ప్రశ్నించింది. సీసీ నిర్లక్ష్యపు సమాధానంతో మనస్తాపానికి గురైన ఆమె కార్యాలయం ఆవరణంలో తన చేయి కోసుకుని నిరసన తెలిపారు. స్థానికులు, వెలుగు సిబ్బంది వెంటనే ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి వెలుగు ఏపీఎం సీతారామును వివరణ కోరగా సీసీకి, నిర్మలకుమారికి మధ్య ఏం జరిగిందో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విమానంలో మద్యంమత్తులో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

- వారించిన సిబ్బందిపై దూషణలు
- తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుడి అరెస్టు

రేణిగుంట, ఏప్రిల్ 6: విమానంలో మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వారించేందుకు ప్రయత్నించిన సిబ్బందినీ దూషించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్యా జిల్లా రాజంపేట మండలం వరదయ్యగారిపల్లెకు చెందిన రెడ్డయ్య దుబాయ్ నుంచి వస్తూ హైదరాబాద్‌లో దిగారు. అక్కడి నుంచి స్పైస్ జెట్ విమానంలో శనివారం ఉదయం తిరుపతికి బయల్దేరారు. ఆయన మద్యం మత్తులో అనుచితంగా ప్రవర్తించారు. బాధిత మహిళా ప్రయాణికురాలితో కలసి విమాన సిబ్బంది ఫిర్యాదు చేశారు. తిరుపతి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది రెడ్డయ్యను అదుపులోకి తీసుకుని ఏర్పేడు పోలీసులకు అప్పజెప్పారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 6: శ్రీ క్రోధి నామ తెలుగు ఉగాదిని పురస్కరించుకుని తిరుపతి జిల్లా రచయితల సంఘం (తి.ర.సం) ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో కవి సమ్మేళనం నిర్వహించనుంది. తి.ర.సం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించనున్న ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రముఖ రచయిత, అధ్యాపకురాలు డాక్టర్ వి.కృష్ణవేణి హాజరవుతారు. ఉగాది కవితా విశ్లేషణ శతావధాని ఆముదాల మురళి చేస్తారు. సాహితీ ప్రియులు పాల్గొనవలసిందిగా సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు కోరారు.

జేఈఈ మెయిన్స్‌కు 107 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: జాతీయ స్థాయిలో ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో దశ పరీక్షకు మూడో రోజైన శనివారం 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 1,412 మంది దరఖాస్తు చేసుకోగా 1,305 మంది హాజరైనట్లు సిటీ కో-ఆర్డినేటర్ టికైలాష్‌నాథ్ వెల్లడించారు.

ఎన్‌డీఏ, ఇండియా కూటముల అభ్యర్థుల పలకరింపు



తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 6: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం బైరాగిపట్టెడలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, ఇండియా కూటమి అభ్యర్థి పి.మురళి ఎదురుపడ్డారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.







చెరువు సమీపంలో చదును చేస్తున్న దృశ్యం - నిర్మాణాలకు సిద్ధం చేసిన ఇటుకలు - దోబీఘాట్‌లో నిర్మాణాలు

పాన చెరువు దురాక్రమణ

- ఎన్నికల హడావుడిలో పని కానిచ్చేస్తున్నారు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 6: నగర పరిధిలోని వినాయకసాగర్ సమీపంలో గల పాన చెరువు ఆక్రమణకు గురవుతోంది. తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 84లో ఉన్న చెరువును మట్టితో పూడ్చి వేస్తున్నారు. మూడు నెలల క్రితం కొందరు ఆక్రమణకు ప్రయత్నించగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమాలను చేపట్టి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆక్రమణదారులు స్తబ్దుగా ఉండిపోయారు.ఎన్నికలు సమీపించడం, అధికారులు ఆ పనుల్లో బిజీగా ఉండడంతో ఇదే అదనుగా భావించి మళ్లీ ఆక్రమణలు మొదలుపెట్టారు. దోబీఘాట్ పక్కనే ఉన్న ప్రదేశంలో అర ఎకరా, మరో చోట ఎకరాకు పైగా భూమిని చదును చేస్తున్నారు. శనివారం ట్రాక్టర్లతో పెద్దఎత్తున మట్టిని నింపారు. నిర్మాణాలు చేపట్టేందుకు ఇటుకలను సిద్ధం చేశారు. కొంత మేర నిర్మాణ పనులు కూడా చేపట్టారు. ఇదంతా వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు సమాచారం. చెరువు పక్కనే ఉన్న దోబీఘాట్‌లో నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నిర్మాణాలను ఆపేశారు.అయితే దీని వెనుక ఎవరు ఉన్నారనే విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. అధికారులు స్పందించి చెరువు స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నశేష, హంస వాహనాలపై కోదండరాముడు



చిన్నశేషవాహనం

తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 6: కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు సీతారాములు చిన్నశేష వాహనంపై మాడవీధుల్లో విహరించారు. ఉదయం 10నుంచి 11.30 వరకు సీతాలక్ష్మణ సమేత శ్రీరాముల వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7నుంచి 8.30 వరకు హంస వాహన సేవ జరిగింది. తిరుమల పెద్ద జీయ్యంగారు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవ ఉంటాయి.



హంసవాహనం

రక్తదానంతో చక్కటి ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 6 : రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమేగాక చక్కటి ఆరోగ్యం పొందే అవకాశముందని రుయాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా రుయాస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో శనివారం రవిప్రభు ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బంది రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. ఈ శిబిరంలో 45 యూనిట్లకు పైగా రక్తం సేకరించి రక్తనిధి కేంద్రంలో భద్రపరిచారు. దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎంవో హరికృష్ణ, రక్తనిధి ఇన్‌చార్జి డాక్టరు నాగరాజు, డాక్టర్లు హరిత, రమేష్‌బాబు, సోమశేఖరయ్య, ప్రవీణ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

ఎంఈవోల సంఘ ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య



తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: హిందూ ఉపాధ్యాయ సమితి ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెళ్లకూరు మండల ఎంఈవో-2గా ఉన్న మించల శంకరయ్యను నియమించినట్లు సంఘ జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కోనసీమ జిల్లా ఆలమూరు మండల ఎంఈవో-2గా పనిచేస్తున్న పీవీ సుబ్బరాజును నియమించామని తెలిపారు. నూతన ప్రతినిధులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జనసేనకు బలిజ సేన మద్దతు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 6: జనసేన పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు బలిజ సేన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమలో ఏకైక బలిజ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. హరిప్రసాద్, బెల్లంకొండ సురేష్, లక్ష్మీపతి, హరీష్, రఘు, మురళి, రామారావు, సుధా తదితరులు పాల్గొన్నారు.



అ'పూర్వ' కలయిక



పూర్వ విద్యార్థులతో అరవింద్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఐక్యం-2కె24 పేరిట శనివారం అలుమ్ని మీట్ నిర్వహించారు. ఆ కళాశాలలో చదివిన పలువురు పూర్వ విద్యార్థులు చేరుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత అనుభవాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఒకచోట చేర్చేందుకు ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాలకు న్యాక్ ఏగ్రేడ్ లభించిందని, అందరి సమన్వయంతోనే సాధించగలిగామని వివరించారు. సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అయోధ్యకాండ పారాయణం



తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై శనివారం ఉదయం జరిగిన తొమ్మిదివ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. అయోధ్యకాండలోని 31 నుంచి 34వ సర్గల్లోని 172 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 197 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల పండితులు రామానుజాచార్య, అనంత, మారుతి శ్లోక పారాయణం చేశారు. ధర్మగిరి వేదపాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. పలు కీర్తనలను రసరమ్యంగా ఆలపించారు.

ఆస్తి రాసివ్వలేదని అవ్వ గొంతుకోసి చంపేశాడు



పోలీసుల అదుపులో ఇళంగోవన్

సత్యవేడు, ఏప్రిల్ 6: ఆస్తి రాసివ్వలేదని అవ్వ గొంతుకోసి చంపేసిన మనవడిని పోలీసులు అరెస్టు చేశారు.పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ శనివారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు గ్రామానికి చెందిన రాజమ్మకు(80) ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భర్త మరణించాక రాజమ్మ తన పెద్ద కుమారుడు మునస్వామిరెడ్డి ఇంట్లో ఉండేది. 10 సంవత్సరాల క్రితం ఆయన కూడా మరణించాక రాజమ్మ, బాగోగులు మునస్వామిరెడ్డి కుమారుడు హరికృష్ణ చూసుకుంటున్నాడు. దీంతో రాజమ్మ తన పేరుతో ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంలో ఎకరా హరికృష్ణ పేరుమీద రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేయించింది.రాజమ్మ చిన్న కొడుకు కృష్ణారెడ్డి తనకు ఆస్తి రాసివ్వలేదంటూ తరచూ తగాదా పెట్టుకునేవాడు.ఈ నెల 2వ తేది హరికృష్ణకు ఫోన్ చేసి ఆస్తిలో తమకు వాటా ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించడంతో అతడి తల్లి దేవకి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. అదే సమయంలో ఇంట్లో రాజమ్మ ఒంటరిగా ఉందని గ్రహించిన కృష్ణారెడ్డి, అతడి భార్య గౌరి పథకం ప్రకారం తమ కుమారుడు ఇళంగోవన్ చేతికి కత్తి ఇచ్చి పంపారు. రాజమ్మను ఇళంగోవన్ గొంతు కోసి పరారయ్యాడు. హరికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఇళంగోవన్ పోలీసుల విచారణ లో నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. దీంతో ఇళంగోవన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. హత్యకు కారకులైన కృష్ణారెడ్డి, గౌరి ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

వైసీపీ అత్యుత్సాహానికి విద్యుత్ పరికరాల దగ్ధం



- స్టోర్‌లో దగ్ధమైన కేబుళ్లు, మీటరు బాక్సులు
- రూ.కోటి వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా
- గోప్యంగా ఉంచిన ఎస్పీడీసీఎల్ అధికారులు



కాలిపోయిన విద్యుత్ కేబుళ్లు, మీటర్ బాక్సులు

శుక్రవారం స్టోర్స్‌లో అగ్నికి ఆహుతవుతున్న విద్యుత్ పరికరాలు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 6: అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పేల్చిన టపాసుల నిప్పురవ్వలు పడి ఎస్పీడీసీఎల్ స్టోర్‌లో విలువైన పరికరాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.కోటి మేర నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేసిన ఈ ప్రమాదాన్ని ఆ శాఖ అధికారులే గోప్యంగా వుంచడం గమనార్హం. విశ్వసనీయవర్గాల వివరాల మేరకు..చిత్తూరు గిరింపేటలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ నాయకులు టపాకాయలు పేల్చారు. వాటినుంచి వచ్చిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న విద్యుత్ స్టోర్‌లో పడి అక్కడున్న విద్యుత్ కేబుళ్లు, మీటర్ బాక్సులు, ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. దీనివల్ల రూ.కోటి వరకు నష్టం జరిగినట్లు అంచనా వేసిన అధికారులు ప్రమాదాన్ని గోప్యంగా వుంచడంపై అందరూ నివ్వెరపోతున్నారు. పైగా గుర్తుతెలియని వ్యక్తులు టపాకాయలు పేల్చడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులకు విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. కాగా శనివారం అగ్నిప్రమాదం జరిగిన స్టోర్‌ను ఎస్పీడీసీఎల్ సీజీఎం చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రమాద వివరాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజీఎం పర్యటనను కూడా అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

మెప్మా కార్యాలయంలోనే సీఎంఎంపై అధ్యక్షురాలి దాడి



దాడిలో కిందపడిపోయిన సౌజన్య



మెప్మా సీఎంఎంపై దాడి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: సచివాలయంలోనే మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్యపై దాడి జరిగింది.సూళ్లూరుపేట గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో ఉన్న సచివాలయంలో సీఎంఎం సౌజన్య సమావేశం నిర్వహిస్తుండగా మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆర్పీలు కలసి ఆమె చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కుని కిందపడేసి దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకొన్నారు.పోలీసులు సాయంత్రం రమ్మనడంతో సీఎంఎం సౌజన్య స్త్రీ స్వశక్తి భవనానికి వెళ్లిపోయారు. సాయంత్రం మెప్మా అధ్యక్షురాలు స్వప్న తన భర్త, అత్తతో స్త్రీ స్వశక్తి భవనానికి చేరుకుని ఆర్పీలతో కలిసి సౌజన్యపై దాడిచేశారు.ఈ దాడిలో సౌజన్య బట్టలు చినిగిపోవడమే కాకుండా స్పృహతప్పి పడిపోయారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు చేరుకొని విచారించారు. ఇటీవల మన్నారుపోలూరులోని ఓ పొదుపు గ్రూపులో లోన్ కట్టే విషయంలో ఆలస్యం చేయడమే కాకుండా ఆర్పీలు కొంత నగదు కాజేసినట్లు తెలిసింది. దీంతో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా బ్యాంకు వద్దకు వెళ్లవద్దని మెప్మా అధ్యక్షురాలికి సీఎంఎం చెప్పడంతో వారి నడుమ వివాదాలు తలెత్తాయి.చివరకు ఈ వివాదాలు దాడి చేసే పరిస్థితికి దారితీశాయి.అధికార పార్టీకి చెందిన మెప్మా అధ్యక్షురాలు తన భర్త, అత్తలను కార్యాలయం లోపలికి తీసుకొచ్చి అధికారిపై దాడిచేయించడం దుర్మార్గమంటూ తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.45 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 59,621 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,351 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి కానుకగా ఎలక్ట్రిక్ బైక్



తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి శనివారం ఓ ఎలక్ట్రిక్ బైక్ కానుకగా అందింది. పుణేకు చెందిన బిగాస్ ఆటోమొబైల్స్ ఎండీ హేమంత్ కాంద్రా, ఉపాధ్యక్షుడు సతీశెట్టితో కలిసి రూ.1.50 లక్షల విలువైన ద్విచక్ర వాహనాన్ని అందజేశారు. ఉదయం శ్రీవారి ఆలయం వద్ద వాహనానికి పూజలు చేయించి, బైక్ తాళాలను టీటీడీ రిసెప్షన్ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్‌కు అందజేశారు. డీఐ సుబ్రహ్మణం పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



రవిబాబు - అమ్మిరెడ్డి

తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సినీ నటుడు, దర్శకుడు రవి బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. రవిబాబు మీడియాతో మాట్లాడుతూ సినిమా షూటింగ్ పూర్తయిన తర్వాత శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. త్వరలో మూడు సినిమాలు అభిమానుల ముందుకు రాబోతున్నాయని తెలిపారు. 'అవును-3' చిత్రం తీయలేమని, ఆ అమ్మాయికి పెళ్లి అయిపోయింది కదా అని మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నిఘా బృందాలు అప్రమత్తంగా పనిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6: ఎన్నికల విధుల్లో ఉన్న బృందాలు అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పూర్తి అవగాహన, బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఆర్వోలు వారి నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని, ఎన్నికల కమిషన్ సూచించిన ప్రొఫార్మాలో రోజువారీ నివేదికలు, పోలింగ్ నివేదికలు సకాలంలో పంపాల్సి ఉంటుందన్నారు. సి-విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలని సూచించారు.

ఎన్నికల కోడ్ కఠినంగా అమలు చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలుపరచాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడ నుంచి ఆయన వర్చువల్ విధానంలో సార్వత్రిక ఎన్నికలపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్స్ పెండింగ్ డిస్పోజల్ నాణ్యతతో కూడి ఉండాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎంసీసీ నోడల్ అధికారులు పర్యవేక్షించి, అమలు చేయాలని కోరారు.

అంకురాలో చిన్నారికి అరుదైన చికిత్స



చిన్నారితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న ఆస్పత్రి ఎండీ డాక్టర్ వంశీ

తిరుపతి (వైద్యం), ఏప్రిల్ 6 : అరుదైన చికిత్స ద్వారా రెండేళ్ల చిన్నారి ప్రాణాలు నిలబెట్టినట్లు అంకురా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వంశీ తెలిపారు. రేణిగుంట రోడ్డులోని అంకురా ఆస్పత్రిలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న నిహాస్వినిని తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువచ్చారని తెలిపారు. పరీక్షలు చేయగా ఊపిరితిత్తుల్లో రక్తస్రావమవుతుండటాన్ని గుర్తించి, నిపుణులైన డాక్టర్లు పృథ్వీ, దినేష్, రామ్‌మోహన్‌తో కలిసి ఐదు రోజులు మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే సెన్సార్ మెడిక్స్ హెచ్ఎఫ్‌వోవి పద్ధతిలో వైద్యం అందించినట్లు తెలిపారు. తద్వారా చిన్నారి పూర్తిగా కోలుకుందని చెప్పారు.

ఘనంగా లిటిల్ ఏంజల్స్ స్నాతకోత్సవం



పట్టాలు పొందిన చిన్నారులతో అతిథులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పాఠశాల స్నాతకోత్సవాన్ని శనివారం ఘనం గా నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థులు బర్డ్ ఆస్పత్రి ఆర్థో డాక్టర్ చైతన్య, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులకు స్నాతకోత్సవ పట్టాలు అందజేశారు. పాఠశాలలో తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ శ్వేత, ప్రిన్సిపాల్ పద్మశ్రీ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



బ్యాగును భక్తునికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 6 : ఓ భక్తుడు ఆటోలో వదిలేసి వెళ్లిన బ్యాగును తిరిగి అప్పగించి డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. విజయనగరానికి చెందిన గౌరీ నాయుడు కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం కోసం శనివారం వచ్చారు. తిరుపతి శ్రీనివాసంలో దర్శనం టోకన్ తీసుకున్నారు. అక్కడి నుంచి తిరుమల బస్టాండుకు ఆటోలో వెళ్లారు. దిగే హడావుడిలో ఆటోలో బ్యాగు మరిచిపోయారు. వారు వెళ్లిపోయిన తర్వాత ఆటోడ్రైవర్ నాగేశ్వరరావు దాన్ని గమనించాడు. అందులో నగదు, నగలు, ఏటీఎం కార్డులు ఉండడంతో తిరుపతి ఈస్ట్ పోలీసులకు అప్పగించాడు. ఈస్ట్ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి గౌరీ నాయుడుకు ఫోన్ చేసి, పిలిపించి, ఆటో డ్రైవర్ సమక్షంలో బ్యాగును అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు.

తిరుమలలో గుర్తు తెలియని యువకుడి మృతి



తిరుమల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ వివరాల మేరకు.. తిరుమల హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న అడవిలోని ఓ చెట్టుకు సుమారు 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడు మృతదేహం వేలాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఉరేసుకుని ఉన్న ఆ యువకుడి మృతదేహాన్ని కిందకు దించి అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఈ నెల 3వ తేదీన ఆ యువకుడు రాంభగీచా వద్ద నడుచుకుంటూ వెళుతున్నట్టు పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా గుర్తించారు. అతను ఎవరు, ఎక్కడి నుంచి ఎప్పుడు వచ్చాడనే అంశాలపై విచారణ జరుపుతున్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● కలెక్టర్‌కు టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి వినతి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6: స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు అధికారులు సహకరించాలని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ నేత పులివర్తి సుధారెడ్డి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కోరారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆమె గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ బూత్‌లో జరిగిన ఘటనలను కలెక్టర్‌కు వివరించారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు సుధారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పద్మావతి కాలేజీలో స్వచ్ఛ భారత్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 6: పద్మావతి డిగ్రీ కాలేజీ అవరణలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉద్యోగులు యూనివర్సిటీ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, అధ్యాపకులు కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిఘా నిద్దరోతోంది..

నిర్వహణ లోపంతో పనిచేయని సీసీ కెమెరాలు - నగరంలో రెచ్చిపోతున్న అసాంఘిక శక్తులు

తిరుపతి రైల్వేస్టేషన్ వద్ద ఓ భక్తుడు విలువైన వస్తువులు, నగదును మరచి ఆటోలో వదలి వెళ్లిపోయాడు. ఆ తర్వాత పోలీసులను కలిసి ఫిర్యాదు చేశాడు. కానీ రైల్వేస్టేషన్ రోడ్డులో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో భక్తుడి బ్యాగు దొరకలేదు.

తిరుమలకు వెళుతున్న వ్యాను రెండు రోజుల క్రితం లీలామహల్ సర్కిల్‌లో ఒక స్కూటరిస్టును ఢీకొంది. అక్కడే ట్రాఫిక్ పోలీసు ఉన్నా వ్యాను డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. స్కూటరిస్టు కాలు, చేతికి గాయాలయ్యాయి. ఇంతకీ ఆ వ్యానును గుర్తిద్దామంటే అక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 6 : నగరంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో బాధితులకు న్యాయం చేయడం పోలీసులకు సవాలుగా మారుతోంది. తిరుపతిలో పదేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన ఒక కాంట్రాక్టర్ ద్వారా 1,200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణ బాధ్యతను సైతం అదే కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్ మృతి చెందడం, బకాయిలు పేరుకు పోవడంతో సీసీ కెమెరాల నిర్వహణను గాలికి వదిలేశారు. ప్రస్తుతం నగరంలో 540 కెమెరాలు పనిచేయడం లేదు. కొన్ని వంగిపోయాయి. మరికొన్ని వైర్లు తెగిపోయి నిరుపయోగంగా ఉన్నాయి. టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ, తుడా సర్కిల్, రామకృష్ణ డీలక్స్ సర్కిల్, లీలా మహల్, మంగళం రోడ్డు, ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. మరోవైపు నాలుగేళ్ల క్రితం మ్యాట్రిక్స్ కంపెనీ ఆధ్వర్యంలో 1,300 కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఇవి కూడా చాలా ప్రాంతాల్లో పనిచేయడం లేదు. రామకృష్ణ సర్కిల్, నాలుగు కాళ్ల మండపం, బాలాజీ కాలనీ, కపిల తీర్థం వద్దనున్న సీసీ కెమెరాల పోల్స్ గాలికి పడిపోయాయి. మ్యాట్రిక్స్ కాంట్రాక్టర్‌కు బకాయిలు ఎక్కువగా పేరుకుపోయాయి. తిరుపతి నుంచి రూ.5.23 కోట్లు పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. దీంతో వారు కెమెరాల నిర్వహణను గాలికి వదిలేశారు. నిఘా ఇలా ఉండడంతో అదే స్థాయిలో అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నాయి. మత్తుకు అలవాటుపడిన పలువురు యువకులు బైక్‌లపై ఇష్టానుసారం తిరుగుతూ చోరీలు చేస్తున్నారు. విపరీతమైన స్పీడుతో వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీనిపై ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న కెమెరా



గాంధీ రోడ్డులో పనిచేయని సీసీ కెమెరా

వేసవిలో క్లాసులు నిర్వహిస్తే చర్యలు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 6: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించే జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయాధికారి (ఆర్ఐఓ) జీవీ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈనెల ఒకటి నుంచి మే 31వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిందని తెలిపారు. జూన్ 1వ తేదీన పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. సెలవుల్లో కొన్ని కళాశాలలు తరగతులు నిర్వహిస్తున్నట్టు, ప్రవేశాలు చేపట్టినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఎవ్వరూ ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించరాదన్నారు. కరపత్రాలు పంచడం, టీవీలు, దినపత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం చేయరాదన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని తిరుపతి పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. రాఘవేంద్ర నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మార్ పల్లి, బాలాజీ కాలనీ, టౌన్‌క్లబ్, ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, పాత మున్సిపల్ కార్యాలయం, లీలా మహల్ రోడ్డు మీదుగా కపిలతీర్థం వరకు ర్యాలీ సాగింది. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీనాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, జల్లి మధుసూదన్, మునిసుబ్రహ్మణ్యం, పొన్నగంటి భాస్కర్, అజయ్‌కుమార్, వరప్రసాద్, గుండాల గోపినాథ్‌రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్, డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ నరేష్, మల్లకుప్పం శేఖర్, నాదముని, వేదవతిరాయల్, ప్రశాంతి రాజు పాల్గొన్నారు.


లౌకిక పార్టీ అభ్యర్థిని గెలిపిద్దాం



ఇండియా కూటమి పార్టీల నాయకుల అభివాదం


తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 6 : దేశవ్యాప్తంగా లౌకికవాద పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలని, తిరుపతి అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి పి.మురళిని గెలిపించాలని నాయకులు కోరారు. బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇండియా కూటమి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ పాలనను వ్యతిరేకించే పార్టీల నాయకులపై ఈడీ దాడులు చేయించడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులతోపాటు వైసీపీ అభ్యర్థులను ఓడించాలని కోరారు. తిరుపతిలో దోపిడీని అరికట్టాలంటే మురళిని గెలిపించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి(కాంగ్రెస్), వి.నాగరాజు(సీపీఎం), పి.అంజయ్య(ఆర్‌పిఐ), నగేష్(ఆప్), నాయకులు డిఎంసి భాస్కర్, జయలక్ష్మి, విశ్వనాథ్, సుబ్రమణ్యం, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అన్నమయ్య గొప్ప సామాజికవేత్త



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 6: భగవంతుడి దృష్టిలో మనుషులందరూ సమానమే అని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమయ్య అత్యున్నత సామాజికవేత్త అని మాజీ వీసీ ఆచార్య కుసుమకుమారి అన్నారు. అన్నమయ్య 521వ వర్ధంతిని పురస్కరించుకుని టీటీడీ ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన సాహిత్య సభలో ఆమె అన్నమయ్య - సామాజికత అనే అంశంపై మాట్లాడారు. ఆరువందల సంవత్సరాల క్రితం అప్పటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో అసమానతలకు వ్యతిరేకంగా అన్నమయ్య తన కలం కదిలించారని, గానం వినిపించారని అన్నారు. అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రానికి చెందిన డాక్టర్ సౌజన్య అన్నమయ్య - నైతికత అనే అంశంపై, నెల్లూరుకు చెందిన పరిశోధకురాలు డాక్టర్ లోకేశ్వరి వెంగమాంబపై అన్నమయ్య ప్రభావం అనే అంశంపై ప్రసంగించారు. సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నానికి చెందిన హరిత సిస్టర్స్ గ్రంధి సాయికృతి బృందం సంగీత సభ నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన శ్రీనిధి తిరుమల బృందం అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజక్టు కళాకారుడు మధుసూదనరావు బృందం సంగీత సభ జరిగింది. ప్రాజక్టు సంచాలకులు విభీషణ శర్మ పాల్గొన్నారు.

వేదభాష్యాలను పరిరక్షించాలి



తిరుపతి రూరల్, ఏప్రిల్ 6: సనాతనధర్మ, వైదిక సంప్రదాయ పరిరక్షణ కోసం వేదభాష్యకారులు రచించిన భాష్య గ్రంథాలను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్వీ వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీ సదాశివమూర్తి పేర్కొన్నారు. వర్సిటీలో వేదభాష్య విభాగం ఆధ్వర్యంలో వైదిక సంప్రదాయ పరిరక్షణే శ్రీమత్ సాయణాదీనాం భాష్యకారాణాం వైశిష్ట్యం అనే శీర్షికతో శనివారం పండిత సదస్సు నిర్వహించారు. ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో పలువురు వేదశాస్త్ర, వేదభాష్య పండితులు, పరిశోధకులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వేదభాష్య వైశిష్ట్యాన్ని యావత్ ప్రపంచానికి అందించాలని, వేదభాష్యాలు చదివే విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలని తెలిపారు. బ్రహ్మశ్రీ గోలి సుబ్రహ్మణ్య శర్మ, ప్రొఫెసర్ రాధాగోవిందత్రిపాఠి, రామకృష్ణ సోమయాజి, శ్రీనాథాచార్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


పొదుపు సంఘాల మహిళలకు రాస్ ఇఫ్తార్ విందు



మాట్లాడుతున్న వెంకటరత్నం నాయుడు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 6: రాస్ ప్రధాన కార్యాలయంలో పొదుపు సంఘాల్లోని ముస్లిం మహిళలకు శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు మాట్లాడుతూ ముస్లిం మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ, ఆర్థిక చేయూత ఇస్తున్నట్లు చెప్పారు. ఉపవాస దీక్షల వల్ల భక్తి భావంతోపాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. పొదుపు సంఘాల సంచాలకులు వి.నాగరాజు మాట్లాడుతూ తమ సంస్థ అందిస్తున్న సహకారంతో మహిళలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో హజరత్ మౌలానా మునవర్, కరుణాకర్, నాగేశ్వర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సరైన జీవన శైలితో ఆరోగ్యం మెరుగు



ప్రసంగిస్తున్న డాక్టర్ రాజరాజేశ్వరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 6: సరైన జీవన శైలిని అనుసరించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎస్వీయూ ఉమెన్ స్టడీస్ అధ్యాపకురాలు డాక్టర్ డి.రాజరాజేశ్వరి పేర్కొన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో ఆరోగ్యం - ఆహార అలవాట్లు అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత జీవన శైలిలో మనిషి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. సరైన ఆహార అలవాట్లు లేకపోవడం వల్ల కూడా ఆరోగ్యం క్షీణిస్తోందని అభిప్రాయపడ్డారు. ఆకుకూరలు, పండ్లు, కూరగాయలను ఆహారంగా తీసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. వ్యాయామం, ధ్యానం, యోగా పట్ల దృష్టి సారించాలని కోరారు. ఉమెన్ స్టడీస్ అధ్యాపకులు డాక్టర్ వి.జగదీశ్వరి, డాక్టర్ దబ్బర రమణ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ 'గ్లాసు' వెళ్లాలి

పార్టీ శ్రేణులతో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు



జనసేన పార్టీ శ్రేణులతో సమావేశమైన ఆరణి శ్రీనివాసులు, కూటమి నేతలు

తిరుపతి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జనసేన పార్టీ బలంగా ఉందని, క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా జనసైనికులు కంకణబద్ధులై ప్రతి ఇంటా గ్లాసు గుర్తు తెలిసేలా ప్రచారం చేయాలని అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కోరారు. పార్టీ 20 డివిజన్ల అధ్యక్షులు, బూత్ నాయకులతో ఒక కల్యాణ మండపంలో శనివారం జనసేన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళ్లాలన్నారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి జనసైనికుడు పనిచేయాలన్నారు. బూత్ స్థాయి కమిటీలను బలంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతోపాటు ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను భారీ మెజారిటీతో గెలిపించి కూటమి అధినాయకులకు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, ఆనంద్, టీడీపీ నేత డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేశవాయనగుంటలోని పార్టీ కార్యాలయానికి ఆరణి శ్రీనివాసులు వెళ్లి నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. వారు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. తిరుపతి అభివృద్ధికి బీజేపీ సహకారం ఎంతో అవసరమని, నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని అన్నారు. జనసేన, బీజేపీ జెండాలు తిరుపతిలో ఎగురవేస్తామని స్పష్టం చేశారు.



బీజేపీ నాయకుల బైక్ ర్యాలీలో పాల్గొన్న ఆరణి శ్రీనివాసులు

ఇంటర్వ్యూ

నాన్నలా.. పిలిస్తే పలుకుతా!



పిలిస్తే పలికే నాయకుడిగా ముద్దుకృష్ణమకు ఉన్న పేరును మరిపించేలా నిరంతరం నగరి నియోజకవర్గ ప్రజల్లో కనిపిస్తుంటారు ఆయన కుమారుడు గాలి భానుప్రకాష్. అవ్వా.. తాతా.. అక్కా.. అన్నా.. అని ప్రతి మనిషినీ పలకరిస్తూ, ప్రజల కష్టసుఖాలు పంచుకుంటూ ఆయన రాజకీయ ప్రయాణం కొనసాగుతోంది. 2019లో అతి తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన ఆయన ఈసారి మరింత జనశక్తితో టీడీపీ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. ఈ సందర్భంగా నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఆలోచనలను ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పంచుకున్నారు.

- పుత్తూరు అర్బన్

గాలి భానుప్రకాష్



బాబు బాటలో, లోకేష్ మార్గదర్శకత్వంలో..

రానున్న ఐదేళ్లల్లో నియోజవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అవసరమైన కార్యాచరణకు సంబంధించి స్పష్టమైన అవగాహనతో ఉన్నాను.. ఇందుకుగాను స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగుతాను. అభివృద్ధికి చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ నగరి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాను. నారా లోకేష్ నాకు మార్గదర్శి. పడిలేచిన కెరటంలా ఈ ఐదేళ్లలో ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం.

"టీడీపీ అధికారంలోకి వస్తే వేణుగోపాలసాగర్‌తో పాటు 0.5 టీఎంసీల సామర్థ్యంతో వేపగుంట రిజర్వాయర్, 0.88 టీఎంసీల సామర్థ్యం గల అడవికొత్తూరు రిజర్వాయర్ కూడా పూర్తి చేస్తాం."

ఇవే నా తొలి ప్రాధాన్యాలు

ప్రతి గ్రామానికీ రోడ్డు, ప్రతి ఇంటికీ నాణ్యమైన విద్యుత్తు, ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు కల్పించడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకుని పని చేస్తాను. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించి పల్లెల ఉసురు తీసింది. గ్రామాల అభివృద్ధి పూర్తిగా పడకేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు, డ్రైనేజీలు తప్ప ఈ ఐదేళ్లలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పనీ చేయలేదు. సొంత పార్టీ కార్యకర్తలకు దోచిపెట్టే పనులు మాత్రమే చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పుత్తూరు, నగరి మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి, మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాను.

ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా

నాన్న ముద్దుకృష్ణమ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పుత్తూరులో డిగ్రీ కళాశాల, మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. వందల సంఖ్యలో పాఠశాలలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు పుత్తూరులో ఇన్ని స్కూల్స్ కళాశాలలు ఉన్నాయంటే అందుకు ముద్దుకృష్ణమ వేసిన పునాదే కారణం. ఈ ఐదేళ్లలో నాడు-నేడు అని పేరుచెప్పి ఉన్న స్కూళ్లను మూసివేశారు. మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తాం. నియోజకవర్గవ్యాప్తంగా అవసరమైన చోట్ల ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వాటి బలోపేతానికి కృషి చేస్తాను. పుత్తూరులో పీజీ సెంటర్, మైనార్టీ విద్యార్థుల కోసం ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేస్తాను. తిరుపతి తరువాత నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు పనిచేస్తాను.

వారసత్వంగా ప్రజాసేవ

నాన్న ముద్దుకృష్ణమ నాయుడి నుంచి పేద ప్రజలకు సేవ చేయడం నాకు వారసత్వంగా వచ్చింది.ప్రజాప్రతినిధిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు, స్థానం ఉన్నాయి. ఆయన నడిచిన బాటలోనే నేనూ రాజకీయాల్లోకి వచ్చాను. సేవ చేయడంలో మా నాన్నకున్న అకుంఠిత దీక్ష, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడంలో ఆయనకున్న చిత్తశుద్ధి, తనను నమ్ముకున్న వాళ్ల కోసం, తాను నమ్మిన వాళ్ల కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించి స్వర్గీయ ఎన్టీఆర్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించారు. ఎన్టీఆర్ ఆశయాలను వమ్ము చేయకుండా రాష్ట్రం కోసం, నియోజకవర్గ ప్రజల కోసం ముద్దుకృష్ణమనాయుడు ఆయన జీవితంలోని చివరి రోజు వరకు కృషి చేశారు. విలువలతో కూడిన రాజకీయాలనే చేశారు. ఒకరిద్దరు అధికారులు చేసిన తప్పుకు పేపర్ లీక్ అయ్యిందనే కారణంతో నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించిన మహావ్యక్తి ముద్దుకృష్ణమ నాయుడు. ఆయన కుమారుడిగా విలువలు, నైతికతతో కూడిన రాజకీయాలు చేస్తాను....పేదల పక్షపాతిగా పనిచేస్తాను. పిలిస్తే పలికే నాయకుడిగా ముద్దుకృష్ణమకు ఉన్న పేరును మరిపించేలా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటాను.ఒక్క మాటలో చెప్పాలంటే నియోజకవర్గానికి, నమ్మి ఓట్లేయనున్న ప్రజలకు ప్రథమ సేవకుడిగా పనిచేస్తాను.

పవర్‌లూమ్స్‌కు పూర్వవైభవం

నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి పైగా పవర్‌లూమ్స్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ రంగం గిట్టుబాటు కాక కూలి పనికి వెళుతున్నారు. వైసీపీ ప్రభుత్వం పవర్‌లూమ్స్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదు. తిరిగి ఈ రంగం పూర్వవైభవం సాధించేందుకు ప్రభుత్వపరంగా రాయితీలు కల్పించేందుకు కృషి చేస్తాను. ఇప్పటికే చంద్రబాబు నాయుడు నగరి పర్యటనలో పవర్‌లూమ్స్‌కు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రకటించారు. ఈ హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే ఖచ్చితంగా అమలు చేస్తాము. అలాగే పవర్‌లూమ్స్‌లో తయారయ్యే వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ విద్యార్థులకు యూనిఫాం, ఆసుపత్రులు, ప్రభుత్వ రంగంలో పనిచేసే కార్మికులకు అందించే విధంగా ప్రయత్నిస్తాను. కార్మికుల పనివిధానంలో మార్పులు వచ్చే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాను.

గాలేరు నగరి పూర్తి చేస్తాం : నగరి నియోజకవర్గానికి వెన్నెముక వంటి గాలేరు నగరి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఇటీవల పుత్తూరులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేణుగోపాలసాగర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరిగాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులను నిలిపివేసింది. ఒక్క వేణుగోపాలసాగర్ ప్రాజెక్టు సామర్థ్యం 2.6 టీఎంసీలు. దీంతో సుమారు 26 వేల ఎకరాలకు మూడు పంటలకు సాగునీరు, నియోజకవర్గ ప్రజలకు తాగునీరు అందించవచ్చు. గత ప్రభుత్వ హయాంలో గాలేరు నగరి ప్రాజెక్టు పనులు జరుగుతున్నా ప్రజలను మభ్యపెట్టడానికి ఎమ్మెల్యే రోజా నగరి నుంచి తిరుమలకు పాదయాత్ర చేశారు. మంత్రిగా ఉండికూడా ఆమె కనీసం ప్రాజెక్టు పరిస్థితిపై ఆరా తీసిన దాఖలాలు లేవు. టీడీపీ అధికారంలోకి వస్తే వేణుగోపాలసాగర్‌తో పాటు 0.5 టీఎంసీల సామర్థ్యంతో వేపగుంట రిజర్వాయర్, 0.88 టీఎంసీల సామర్థ్యం ఉన్న అడవికొత్తూరు రిజర్వాయర్లు కూడా పూర్తి చేసి నియోజకవర్గాన్ని సస్యశ్యామలంగా మారుస్తాను.

"ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర మంత్రిగా రోజా ఒక్క పరిశ్రమైనా నియోజకవర్గానికి ఎందుకు తీసుకురాలేకపోయిందో సమాధానం చెప్పాలి. ఆమెకు అవినీతిపైన ఉండే శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపైన లేదు."

రైతులకు అండగా ఉంటా : గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీని తెరవాలని గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న రోజా ధర్నా చేశారు. మరి మంత్రిగా ఎందుకు తెరిపించలేకపోయారు? నింద్ర షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు బిల్లులు ఎందుకు చెల్లించలేదు? ఏ అదృశ్యశక్తి అడ్డుపడుతోందో ఆమె రైతులకు చెప్పాలి. మామిడి రైతులు గిట్టుబాటు ధర లేకుండా విలవిల్లాడుతుంటే నోరు కూడా మెదపడంలేదు. మేము రైతులకు అండగా ఉంటాం. నింద్ర షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వపరంగా తీసుకుంటాము. మామిడికి గతంలో గిట్టుబాటు ధర రానప్పుడు చంద్రబాబు ప్రభుత్వం టన్నుకు రూ.5 వేలు మద్దతు ధర చెల్లించింది. గతంలో రైతులకు ఇస్తున్న అన్ని సబ్సిడీ పథకాలనూ పునరుద్ధరిసాం. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇవ్వడంతో పాటు ఎరువులు కూడా అందిస్తాం. రైతులకు అండగా నిలిచేది టీడీపీ ప్రభుత్వమే.

పరిశ్రమలను ఏర్పాటు చేస్తాము... : పరిశ్రమల ఏర్పాటుకు వడమాలపేట, విజయపురం మండలాలు అత్యంత అనుకూలం. వడమాలపేట మండలం తిరుపతికి ఆనుకుని ఉంటే, విజయపురం మండలం తమిళనాడు సరిహద్దు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు చేసిన భూసేకరణ ఈ ఎమ్మెల్యే కారణంగా ఎంత వివాదాస్పదమైంది అనేది అందరికీ తెలిసిందే. పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం ఉన్నప్పటికీ పొలిటికల్ కరప్షన్ కారణంగా పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు. ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా, రాష్ట్ర మంత్రిగా రోజా ఒక్క పరిశ్రమైనా నియోజకవర్గానికి ఎందుకు తీసుకురాలేకపోయిందో సమాధానం చెప్పాలి. ఆమెకు అవినీతిపైన ఉండే శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపైన లేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం, వడమాలపేట, విజయపురం మండలాల్లో పరిశ్రమల ఏర్పాటు కూడా తథ్యం. నియోజకవర్గ యువత ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉపాధి పొందే విధంగా కృషి చేస్తాను.

"ఈ ఐదేళ్ల పాలన చూసిన ప్రజలు విసిగిపోయారు. ఎన్నికల కోసం మాకన్నా ప్రజలే ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. వైసీపీకి డిపాజిట్లు కూడా దక్కవు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపును ఆపలేరు."

నగరి గడ్డపై టీడీపీ జెండా : గత ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయాను. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక విధ్వంసపాలన సాగింది. అవినీతి, వనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగింది.. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచి పేద, మధ్య తరగతి వర్గాల నడ్డి విరిచారు. బియ్యం, నూనె, పప్పు, ఉప్పుతో సహా నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. ట్రాక్టర్ ఇసుక ధర రూ.5 వేలకు పెంచేశారు. ప్రతి పనికీ లంచం ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోసం మాకన్నా ప్రజలే ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి రోజా నియోజకవర్గం కేంద్రంగా ఈ ఐదేళ్లలో చేసిన అవినీతి, నియోజకవర్గంపై ఆమె కుటుంబం పెత్తనం, ప్రశ్నించే వారిపై తారస్థాయికి చేరిన కక్ష సాధింపులు ప్రజల గుండెల్లో బడబాగ్నిలా ఉన్నాయి. వారి ఆగ్రహ జ్వాలలకు రానున్న ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయం. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో జీవించేలా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు గ్యారంటీలపై ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కష్టంతో రానున్న ఎన్నికల్లో నగరి గడ్డపై టీడీపీ జెండా ఎగరడం ఖాయం.

టీడీపీలో చేరిన వైసీపీ యువత



భాస్కర్‌రెడ్డి అనుచరులతో భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 6: వడమాలపేటకు చెందిన వైసీపీ యువత నేత భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. వారికి గాలి భానుప్రకాష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గిరీష్ రాజు, పాండు, విజయ్, యాకుబ్, దినేష్, వెంకటేష్, శివ, సాయి, తేజ, హరీష్, చరణ్, కిటి, దిలీప్, వంశీ, సునీల్, నాగూర్, శేఖర్, అజయ్, శివయ్య, భరత్, ముని, రమేష్, సునీల్, సుదర్శన, చంద్ర తదితరులు ఉన్నారు. అలాగే గంధపు దళితవాడలో చెందిన సురేష్, అనిల్, జేమ్స్, కాటయ్య, ఆనందయ్యతో పాటు పలువురు యువకులు టీడీపీలో చేరారు.

శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఏప్రిల్ 6: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఊంజల సేవ, పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి గామోత్సవం నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, ఏప్రిల్ 6: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు

టీడీపీని గెలిపించండి: భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 6: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ కోరారు. శనివారం వడమాలపేట మండలంలోని ఎనమలపాలెం దళితవాడలో క్లస్టర్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అరాచక పాలన సాగుతోందని, వైసీపీ నేతల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలను కోరారు. టీడీపీ ప్రకటించి మేనిఫెస్టో ప్రతి పేదవారి ఇంటా వెలుగులు నింపుతుందని, ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నాయుడు ఖచ్చితంగా అమలుచేస్తారని చెప్పారు. టీడీపీ నాయకులు టి.ధనంజయులు ఆధ్వర్యంలో దాము, గంగముని, చంద్ర, నాదముని, నాగార్జున, మునిరామయ్య ఆధ్వర్యంలో దళిత యువకులు భాను ప్రకాష్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గురవయ్య, రాజేష్, మురలీ, హరి, నాగరాజు, రఘురామ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎనమలపాలెంలో కరపత్రాలను అందిస్తున్న భానుప్రకాష్



టీడీపీలో చేరిన వారితో ఆదిమూలం

టీడీపీలో చేరికలు

నారాయణవనం, ఏప్రిల్ 6: మండల పరిధిలోని పాలమంగళం, ఉత్తరపు కండ్రిగ, ఎస్టీ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు శనివారం సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆదిమూలం టీడీపీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో పార్టీలో చేరిన వారిలో భాస్కరన్, గోవిందస్వామి, సుబ్రమణ్యం, మునిబాబు, సోమశేఖర్, దయా, పట్టాభి, సుకుమార్, కొల్లాపురి, కోదండపాణి, మునివేలు, మురుగేష్, కోదండయ్య, రమేష్, ఎస్టీ కాలనీకి చెందిన అవనాక్షయ్య, రమేష్, గోపాల్, ఎస్సీ నాయకులు నాగయ్య, అమావాసయ్య, శ్యామ్, గోపీ, కుప్పయ్య, శివయ్య ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



భావేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



భావేష్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 6: అనుమానాస్పద స్థితిలో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... విన్నమాల దళితవాడకు చెందిన వెంకటయ్య, సుభాషిణి దంపతుల కుమారుడు భావేష్(14) నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. సెలవులు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో రాళ్ల నడుమ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు రాళ్లను తీసి చూడగా అందులో ఓ బాలుడు మృతదేహం లభ్యమైంది. అదే సమయానికి అక్కడకు చేరుకున్న భావేష్ తల్లిదండ్రులు చూసి ఆ మృతదేహం తమ కుమారుడుదేనంటూ బోరున విలపించారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనాస్థలాన్ని చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. భావేష్ తల, ముఖంపై గాయాలు ఉండటంతో తిరుపతి నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతదేహం ఉన్న ప్రాంతం నుంచి విన్నమాల దళితవాడ వరకు డాగ్ స్క్వాడ్ వెళ్లి ఆగిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మెప్మా సీఎంఎంపై దాడి - దాడిలో కిందపడిపోయిన సౌజన్య

మెప్మా కార్యాలయంలోనే

సీఎంఎంపై అధ్యక్షురాలి దాడి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: సచివాలయంలోనే మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్యపై దాడి జరిగింది.సూళ్లూరుపేట గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో ఉన్న సచివాలయంలో సీఎంఎం సౌజన్య సమావేశం నిర్వహిస్తుండగా మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆర్పీలు కలసి ఆమె చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కుని కిందపడేసి దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకొన్నారు.పోలీసులు సాయంత్రం రమ్మనడంతో సీఎంఎం సౌజన్య స్త్రీ స్వశక్తి భవనానికి వెళ్లిపోయారు. సాయంత్రం మెప్మా అధ్యక్షురాలు స్వప్న తన భర్త, అత్తతో స్త్రీ స్వశక్తి భవనానికి చేరుకుని ఆర్పీలతో కలిసి సౌజన్యపై దాడిచేశారు.ఈ దాడిలో సౌజన్య బట్టలు చినిగిపోవడమే కాకుండా స్పృహతప్పి పడిపోయారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఎస్ఐ రహీం రెడ్డి అక్కడకు చేరుకొని విచారించారు. ఇటీవల మన్నారుపోలూరులోని ఓ పొదుపు గ్రూపులో లోన్ కట్టే విషయంలో ఆలస్యం చేయడమే కాకుండా ఆర్పీలు కొంత నగదు కాజేసినట్లు తెలిసింది. దీంతో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా బ్యాంకు వద్దకు వెళ్లవద్దని మెప్మా అధ్యక్షురాలికి సీఎంఎం చెప్పడంతో వారి నడుమ వివాదాలు తలెత్తాయి.చివరకు ఈ వివాదాలు దాడి చేసే పరిస్థితికి దారితీశాయి.అధికార పార్టీకి చెందిన మెప్మా అధ్యక్షురాలు తన భర్త, అత్తలను కార్యాలయం లోపలికి తీసుకొచ్చి అధికారిపై దాడిచేయించడం దుర్మార్గమంటూ తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

293 గ్రాముల బంగారం స్వాధీనం

చిల్లకూరు, ఏప్రిల్ 6: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న 293 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని చెప్పారు. నెల్లూరు నుంచి చెన్నైకు రిలయన్స్ సంస్థకు చెందిన ఓ వాహనం బంగారు ఆభరణాలను తీసుకువెళుతుండడాన్ని గుర్తించామన్నారు. అందులో 36కిలో బంగారు ఆభరణాలకు సంబంధించిన రికార్డులు ఉన్నాయన్నారు. 17.30లక్షల విలువచేసే 293 గ్రాముల బంగారానికి తగిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి జీఎస్టీ అధికారులకు అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు. తనిఖీల్లో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

17 మంది వలంటీర్లు రాజీనామా

తడ/నాయుడుపేట, ఏప్రిల్ 6: తడ మండలం కాదలూరు సచివాలయ పరిధిలోని 13 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్వగ్రామమైన కాదలూరు సచివాలయ పరిధిలో 14మంది వలంటీర్లు ఉండగా, వారిలో 13మంది ఎంపీడీవో ఆమోస్‌బాబుకు రాజీనామా పత్రాలు సమర్పించారు. అలాగే నాయుడుపేట మండలం మర్లపల్లె సచివాలయ పరిధిలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తా: సుధీర్


బీజేపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు

రేణిగుంట, ఏప్రిల్ 6: ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని ఎల్‌ఎన్‌కండ్రిగ, ఆర్. మల్లవరం, వెదళ్ల చెరువు గ్రామాల్లో 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అంతకు ముందు మల్లవరానికి చెందిన బీజేపీ నాయకులు బొబ్బిలిరెడ్డి, వంశీ, రాజశేఖర్‌రెడ్డి, రమేష్, సుబ్రహ్మణ్యం టీడీపీలో చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మహబూబ్‌బాషా, పార్ల మెంటు ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు చిన్నారెడ్డి, మునస్వామినాయుడు, నాదమునిరెడ్డి, కన్నన్‌రెడ్డి, బుజ్జినాయుడు, రాజేంద్ర, రవి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వర స్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారం పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వర స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆస్తి రాసివ్వలేదని అవ్వ గొంతుకోసి చంపేశాడు


పోలీసుల అదుపులో ఇళంగోవన్

సత్యవేడు, ఏప్రిల్ 6: ఆస్తి రాసివ్వ లేదని అవ్వ గొంతు కోసి చంపేసిన మనవడిని పోలీసులు అరెస్టు చేశారు. పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ శనివారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పిచ్చాటూరు మండలం అడవి కొడియంబేడు గ్రామానికి చెందిన రాజమ్మకు(80) ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. భర్త మరణించాక రాజమ్మ తన పెద్ద కుమారుడు మునస్వామిరెడ్డి ఇంట్లో ఉండేది. 10 సంవత్సరాల క్రితం ఆయన కూడా మరణించాక రాజమ్మ, బాగోగులు మునస్వామిరెడ్డి కుమారుడు హరికృష్ణ చూసుకుంటున్నాడు. దీంతో రాజమ్మ తన పేరుతో ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంలో ఎకరా హరికృష్ణ పేరుమీద రెండు నెలల క్రితం రిజిస్ట్రేషన్ చేయించింది. రాజమ్మ చిన్న కొడుకు కృష్ణారెడ్డి తనకు ఆస్తి రాసివ్వలేదంటూ తరచూ తగాదా పెట్టుకునేవాడు. ఈ నెల 2వ తేది హరికృష్ణకు ఫోన్ చేసి ఆస్తిలో తమకు వాటా ఇవ్వకుంటే చంపేస్తామని బెదిరించడంతో అతడి తల్లి దేవకి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. అదే సమయంలో ఇంట్లో రాజమ్మ ఒంటరిగా ఉందని గ్రహించిన కృష్ణారెడ్డి, అతడి భార్య గౌరి పథకం ప్రకారం తమ కుమారుడు ఇళంగోవన్ చేతికి కత్తి ఇచ్చి పంపారు. రాజమ్మను ఇళంగోవన్ గొంతు కోసి పరారయ్యాడు. హరికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఇళంగోవన్ పోలీసుల విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. దీంతో ఇళంగోవన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. హత్యకు కారకులైన కృష్ణారెడ్డి, గౌరి ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఏర్పేడు, ఏప్రిల్ 6: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి అన్నారు. ఏర్పేడు మండలం గోపాలపురం, రామాపురం, ఇసుకతాగేలి గ్రామాల్లో ఇంటింటా ఆమె ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి సుధీర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ట్యాంకు, పైపులైన్‌కు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 6: మండలంలోని పీవీకండ్రిగ పంచాయతీ పరిధిలోని ఏ పార్లపల్లి గ్రామంలోని తాగునీటి ట్యాంకు, పైపులైన్‌కు సర్పంచ్ కోటమ్మ శనివారం మరమ్మతులు చేయించారు. ట్యాంకు లోపల శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని పూజిత బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో ఆదివారం శంకర నేత్రాలయ ఆస్పత్రి చెన్నై వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని డైనమిక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మైనారిటీల ఆదరణ మరువలేను : సుధీర్



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6: బొజ్జల కుటుంబాన్ని ఆదరిస్తున్న మైనారిటీలను ఎప్పటికీ మరువలేనని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. టీడీపీ పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ రైస్ మిల్లులో శనివారం బొజ్జల సుధీర్ రెడ్డి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మైనారిటీలు విందుకు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బొజ్జల రిషితారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

తొట్టంబేడు, ఏప్రిల్ 6: మండలంలోని శ్రీకాళహస్తి -చెన్నై జాతీయ రహదారి బీడీ కాలనీ క్రాస్ వద్ద తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర శనివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న బీడీ కాలనీకి చెందిన మధు(33)ను అరెస్టు చేశారు. అతడి నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

సీఎస్‌కు సాదర స్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 6: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి సాదర స్వాగతం లభించింది. సాయంత్రం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుచానూరు ఆలయానికి వెళ్లారు.

ఆశీర్వదించండి.. అందుబాటులో ఉంటా : ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, ఏప్రిల్ 6: 'వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మకండి.. నన్ను గెలిపించండి. అందరికీ అందుబాటులో ఉంటా'నని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. పిచ్చాటూరులో ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో శనివారం ఆదిమూలం ఆధ్వర్యంలో ప్రజాగళం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి సాగించిన దోపిడీని ప్రశ్నించినందుకే తనకు వైసీపీలో టికెట్ లేకుండా చేశారని విమర్శించారు. చంద్రబాబు తనకు టికెట్ ఇచ్చి ఆదరిస్తే సహించని పెత్తందారు పెద్దిరెడ్డి తనను ఓడించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. తాను స్థానికుడినని తాను గెలిస్తే ఇక్కడే మీమధ్యే ఉంటానని స్పష్టం చేశారు. అదే వైసీపీ అభ్యర్థి గెలిస్తే ఎవరికీ దొరకరని తెలిపారు. తాను ఎవరిపైనా ఎలాంటి కేసులు పెట్టలేదని, కేసులన్నీ పెట్టింది పెద్దిరెడ్డి అనుచరులేనని ఆ నెపాన్ని తనపై వేస్తున్నారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్రానికి కావాల్సింది విజన్ కలిగిన చంద్రబాబు పరిపాలన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులు నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఇళంగోవన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, రామాంజులు నాయుడు, గోపీనాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భాస్కరన్, జనసేన అధ్యక్షుడు లావణ్యకుమార్, బీజేపీ అధ్యక్షుడు ఆనందనాయుడు, మాజీ జడ్పీటీసీ సుందరరామిరెడ్డి, సుమాంజలి, మల్లికార్జునరెడ్డి, అరుల్ ప్రకాష్, ఎమ్మెస్ రవి, పద్దురాజు, వాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడలి కోసం చేయికోసుకున్న అత్త

వెలుగు అధికారుల తీరుపై నిరసన.. సంఘమిత్ర నియామకంపై కన్నీరు


చేతికి కట్టుతో నిర్మల కుమారి

వరదయ్యపాళెం, ఏప్రిల్ 6: తన కోడలితో మూడేళ్లుగా ఉచితంగా పనులు చేయించుకుని ఇప్పుడు వేరే మహిళను సంఘమిత్రగా నియమించుకోవడంతో మనస్తాపానికి గురైన అత్త చేయికోసుకుని నిరసన తెలియజేసింది. వెలుగు అధికారుల తీరుపై కన్నీరుమున్నీరైంది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. ఆమె కథనం మేరకు.. మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ వీవో లీడర్‌గా నిర్మలకుమారి పనిచేసేది. ప్రస్తుతం ఆమె విధుల్లో లేరు. అయితే నిర్మలకుమారి కోడలు సుకుమారి సంఘమిత్రగా మూడేళ్లుగా పనిచేస్తోంది. అయినా వెలుగు అధికారులు ఆమె పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. పైగా కోడలికి కాకుండా సంఘ మిత్ర బాధ్యతలు వేరే మహిళలకు అప్పగించడంతో ఆమె శనివారం వెలుగు కార్యాలయానికి చేరుకున్నారు. సీసీ యశోదను నిలదీశారు. మూడేళ్లుగా తన కోడలితో ఉచితంగా పనిచేయించుకుని ఇపుడు మరో మహిళను ఎలా నియించుకుంటారని ప్రశ్నించింది. సీసీ నిర్లక్ష్యపు సమాధానంతో మనస్తాపానికి గురైన ఆమె కార్యాలయం ఆవరణంలో తన చేయి కోసుకుని నిరసన తెలిపారు. స్థానికులు, వెలుగు సిబ్బంది ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఇన్‌చార్జి వెలుగు ఏపీఎం సీతారామును వివరణ కోరగా సీసీకి, నిర్మలకుమారికి మధ్య ఏం జరిగిందో విచారించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైల్వే పోలీస్ పేరుతో డబ్బుల డిమాండ్..!

నాగలాపురం, ఏప్రిల్ 6: రైల్వే పోలీసు పేరుతో నాగలాపురం లోని ఓ ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడి నుంచి డబ్బు డిమాండ్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గత బుధవారం ఓ వ్యక్తి నాగలాపురం పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని ఉన్న ఓ ఇంటర్‌నెట్ సెంటర్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. చెన్నై ఎగ్మోర్ టు తిరుచ్చిరాపల్లికి ఆన్‌లైన్‌లో రైల్వే టికెట్ బుక్ చేయాలని నిర్వాహకుడిని కోరాడు. టికెట్ చేశాక మళ్లీ క్యాన్సిల్ చేయాలని కోరాడు. అంతేగాకుండా తాను ఆర్‌పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్) పోలీసునని మీకు టికెట్ బుక్ చేసే అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించాడు. అనుమతుల లేకుండా టికెట్ బుక్ చేసినందుకు రూ.50వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా వేస్తామని బెదిరించాడు. ఆన్‌లైన్‌లో ఎవరైనా బుక్ చేసుకోవచ్చని సమాధానం చెప్పడంతో.. మా పై అధికారులు సమీపంలోనే ఉన్నారు తీసుకు వస్తానని వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత ఫోన్ చేసి 'మా రైల్వే ఎస్ఐ ఇక్కడే ఉన్నాడు. నీపై కేసు లేకుండా చూస్తాము సార్ వాళ్లరు రూ.2వేలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశాడు. 'కావాలంటే మా ఎస్ఐతో మాట్లాడు 'అంటూ వేరే వ్యక్తితో మాట్లాడించాడు. ఆవ్యక్తి ఫోన్‌లో మాట్లాడిన సంభాషణను ఇంటర్ నెట్ సెంటర్ నిర్వాహకుడు పూర్తిగా రికార్డు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాల్ వచ్చిన సెల్ నెంబర్ ఆధారంగా చూస్తే ఆవ్యక్తిది పిచ్చాటూరు మండలం నీరు వాయి గ్రామంగా తెలిసింది. కాగా నాగలా పురంలోని మరికొన్ని నెట్ సెంటర్ల వద్ద ఇలా డబ్బు డిమాండ్ చేసినట్లు సమా చారం.

విమానంలో మద్యంమత్తులో మహిళ పట్ల అసభ్య ప్రవర్తన

- వారించిన సిబ్బందిపై దూషణలు
- తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుడి అరెస్టు

రేణిగుంట, ఏప్రిల్ 6: విమానంలో మద్యం మత్తులో ఓ ప్రయాణికుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వారించేందుకు ప్రయత్నించిన సిబ్బందినీ దూషించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్యా జిల్లా రాజంపేట మండలం వరదయ్యగారిపల్లెకు చెందిన రెడ్డయ్య దుబాయ్ నుంచి వస్తూ హైదరాబాద్‌లో దిగారు. అక్కడి నుంచి స్పైస్ జెట్ విమానంలో శనివారం ఉదయం తిరుపతికి బయల్దేరారు. ఆయన మద్యం మత్తులో అనుచితంగా ప్రవర్తించారు. బాధిత మహిళా ప్రయాణికురాలితో కలసి విమాన సిబ్బంది ఫిర్యాదు చేశారు. తిరుపతి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది రెడ్డయ్యను అదుపులోకి తీసుకుని ఏర్పేడు పోలీసులకు అప్పజెప్పారు.

రోడ్డుపై ఆగిపోయిన బస్సు


మరో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

రేణిగుంట, ఏప్రిల్ 6: తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి శనివారం ప్రయాణికులతో వెళుతున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు రోడ్డుపై ఆగిపోయింది. బస్సు వెనుకవైపు కట్టప్లేట్స్ విరిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దాదాపు గంటపాటు ప్రయాణికులు ఎండలోనే ఉండాల్సి వచ్చింది. తర్వాత ఇతర బస్సుల్లో శ్రీకాళహస్తికి తరలించారు. కాగా తిరుపతి - శ్రీకాళహస్తి మార్గంలో ప్రయాణించే బస్సులు ఇటీవల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని మంచి కండిషన్‌లో ఉన్న బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు


ప్రచారంలో చిన్నపాండూరు పంచాయతీ వలంటీరు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 6: వలంటీర్లు రాజకీయ ప్రచారాల్లో పాల్గొన కూడదని ఎన్నికల కమిషన్ చెబుతున్నా వలంటీర్లు వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్నారు. శుక్రవారం వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ చిన్నపాండూరు పరిధిలో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో వీకేఆర్‌పై కాలనీ క్లస్టర్‌కు చెందని వలంటీరు శోభ, చిన్నపాండూరు పంచాయతీ వలంటీరు పాల్గొనడం గమనార్హం.


వైసీపీ ప్రచారంలో పాల్గొన్న చిన్నపాండూరు వీకేఆర్‌పై కాలనీ క్లస్టర్‌కు చెందిన వలంటీరు శోభ

ఇద్దరు వలంటీర్లకు షోకాజ్‌లు

తొట్టంబేడు, ఏప్రిల్ 6: శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు వలంటీర్ చిట్టెం పవన్‌కుమార్ (క్లస్టర్ -15), మన్నవరం వలంటీర్ కొల్లం వంశీ (క్లస్టర్-11) గురువారం సీఎం జగన్ యాత్రలో పాల్గొన్నారు. ఆ ఫోటోలు సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోలను కొందరు ఈసీ వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయడంతో వారికి ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద అధికారులు షోకాజ్ నోటీసులు జారీచేశారు.

వీఆర్‌కు కానిస్టేబుల్ బుజ్జిబాబు

ఏర్పేడు, ఏప్రిల్ 6: ఏర్పేడులోని అశోక్‌నగర్‌లో శుక్రవారం రాత్రి 9గంటలకు పందెరి భజన నేర్చుకుంటున్న మహిళల వద్ద ఏర్పేడు కానిస్టేబుల్ బుజ్జిబాబు మద్యం మత్తులో వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. అయితే దీనిపై పోలీసుశాఖ ఆయనను వీఆర్‌కు పంపినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన

సత్యవేడు, ఏప్రిల్ 6: మండలంలోని ఏఎం పురంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. సచివాలయ ప్రాంగణంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు మురళీకృష్ణ, సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల వైద్యులు విద్యాసాగర్ తదితరులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈవో సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం, ఫార్మాసిస్టు భార్గవి, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఏఎన్ఎం రేణుక, ఆరోగ్యమిత్ర మునెమ్మ, ఆశ వర్కర్లు, బుజ్జమ్మ, పలువురు రోగులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శనిత్రయోదశి పూజలు


నందీశ్వరునికి జరుగుతున్న అభిషేకాలు

నాగలాపురం, ఏప్రిల్ 6: మండల పరిధిలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో శనివారం శనిత్రయోదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుక్కల్ అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరునికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం, పన్నీరు మొదలగు వాటితో అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేపట్టి మంగళ వాయిద్యాల నడుమ నక్షత్ర హారతి, కుంభహారతి, మహా హారతులు సమర్పించారు. స్వామివారికి హారతి సమయంలో భక్తుల శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. హారతి అనంతరం ఉత్సవ మూర్తులైన స్వామి, అమ్మవార్లను దివ్యాంగ సుందరంగా ముస్తాబు చేసి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజలకు సత్యవేడు శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉభయదారులుగా వ్యవహ రించారు. ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ప్రేరణ ఉత్సవ్‌పై విద్యార్థులకు పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సత్యవేడు, ఏప్రిల్ 6: మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంఈవో రవి ఆధ్వర్యంలో విజన్ ఇండియా, వికసిత్ భారత్ అంశాల మీద శనివారం వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో మదనంబేడు జడ్పీ హైస్కూలు విద్యార్థిని లేఖ, డ్రాయింగ్ పోటీల్లో పుదుకుప్పం జడ్పీ హైస్కూలు విద్యార్థిని కార్తీక, హిందీ వక్తృత్వ పోటీల్లో మదనంబేడు జడ్పీ హైస్కూలు విద్యార్థి ఎస్.కె.మహ్మద్ సాజిద్, పద్య పఠనంలో పుదుకుప్పం విద్యార్థి ముగిల్ విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 19న తిరుపతి నవోదయ పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఉష, ఉపాధ్యాయులు కుమార్, జగదీష్, రోమా, గోపి, సురేష్ పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లి వృద్ధుడి మృతి


శ్రీనివాసులు(ఫైల్‌ఫొటో)

తొట్టంబేడు, ఏప్రిల్ 6: చేపలవేటకు వెళ్లి ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్ కథనం మేరకు..బొక్కసం శ్రీనివాసులు (70) బుధవారం పక్కనే ఉన్న చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. అతని కుమారులు తన తండ్రి కనుపూరులో జరిగే ముత్యాలమ్మ జాతరకు వెళ్లి ఉంటాడని భావించారు. అయితే మూడు రోజులు కావస్తున్నా తండ్రి ఇంటికి రాకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫోన్ సిగ్నల్ చెరువు వద్ద వస్తోందని పోలీసులు గుర్తించారు. ఆ మేరకు కుటుంబసభ్యులు గాలిస్తుండగా శనివారం మధ్యాహ్నం చెరువులో మృతదేహం తేలింది. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి వైద్యులు ముచ్చివోలు గ్రామంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా రెండు నెలల క్రితం మృతుడి చిన్న కోడలు, వియ్యంకురాలు కూడా పశువులు మేపుతూ ప్రమాదవశాత్తూ అదే చెరువులో పడి మృతిచెందారు.

దేశాభివృద్ధే బీజేపీ ధ్యేయం : కోలా ఆనంద్


శ్రీకాళహస్తిలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6: భారతదేశ అభివృద్ధే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శ్రీకాళహస్తిలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద ముందుగా శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటాలకు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాలతో నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, గరికపాటి రమేష్ బాబు, అమర్నాథ్, చందు రాయల్ పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రతాప్ ఆధ్వర్యంలో ఆపార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మునికృష్ణయ్య, ఓబీసీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వరులు, మండల ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మండలాధ్యక్షుడు పురుషోత్తంనాయుడు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు.

కేవీబీపురం: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్‌యాదవ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రేణిగుంట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేణిగుంట బస్టాండు వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛభారత్ నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షురాలు తేజవతి తదితరులు పాల్గొన్నారు.